నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
3 | నిజామాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | NIZAMABAD

# రంగంలోకి నిఘా సంస్థలు!




టీఎన్జీవో వ్యవహారాలపై ఆరా
సీఎస్, జీఏడీకి ఫిర్యాదుల పరంపర
'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
ఆగమాగమవుతున్న కొందరు అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నిజామాబాద్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ నిజామాబాద్ జిల్లా శాఖ వ్యవహారాలపై నిఘా సంస్థలు దృష్టి సారించాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పూర్తి వివరాలను సేకరించే పనిలో పడినట్లుగా తెలిసింది. బుధవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రిక జిల్లా సంచికలో ప్రచురితమైన 'సీటు వదలం... టీఎన్‌జీవోలో అనర్హులు...' కథనం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెను దుమారం రేపింది. ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఉద్యోగ సంఘాన్ని అడ్డంగా పెట్టుకొని రాజకీయ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులెవరు? ఇందులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరు? అన్న కోణంలో ఉద్యోగులంతా చర్చించుకున్నారు. ప్రభుత్వాలు మారిన వెంటనే ప్లేటు ఫిరాయించి ప్రజాప్రతినిధులను కాకాపడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన వైనంపైనా సర్వత్రా వ్యతిరేకత ఏర్పడుతుండగా కీలకమైన నాయకుల తీరును తూర్పార పడుతున్నారు. 'నమస్తే తెలంగాణ' కథనంతో జీఏడీ అధికారుల్లో చలనం వచ్చింది. పలువురు సీనియర్ సిటిజన్లు, టీఎన్‌జీవో సభ్యులు మూకుమ్మడిగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో సాధారణ పరిపాలన శాఖలో స్పందన కనిపించింది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న నిజామాబాద్ జిల్లా టీఎన్‌జీవో వ్యవహారం ఇప్పుడు ఒక్కసారిగా గుప్పుమన్నట్లయ్యింది. ప్రభుత్వ ఆదేశాలతో నిఘావర్గాలు సేకరిస్తున్న సమాచారం ఇప్పుడు కీలకంగా మారనున్నది. టీఎన్‌జీవో నేతల అక్రమ వ్యవహారాలపై లోతుగా విచారణ చేసేందుకు సైతం ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా సమాచారం.


**వెలుగులోకి కొత్త విషయాలు...**

టీఎన్జీవోకు సంబంధించిన వ్యవహారాలను చూడాల్సిన వారంతా తమ వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట వేసి ఉద్యోగుల సంక్షేమాన్ని పక్కదారి పట్టించడంపై ఇప్పుడు సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. టీఎన్జీవోలో 30ఏండ్ల క్రితం సభ్యత్వం తీసుకొని నేటికీ చాలా మంది సభ్యులుగానే కొనసాగుతున్నారు. అలాంటి వారికి ఎలాంటి సంఘం పదవులు లేకపోగా కీలకమైన బాధ్యతల్లో కొందరు అర్హత లేకున్నా దశాబ్దాలుగా కొనసాగుతుండడం తీవ్ర చర్చనీయాంశం అవుతున్నది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్సీ భర్తతో కాంగ్రెస్ పెద్దలను కలిసి సీటును సురక్షితంగా కాపాడుకునే యత్నాలు సైతం జరుగుతున్నాయి. తాజాగా భూ వ్యవహారాలు సైతం ఇందులో వెలుగు చూస్తున్నాయి. సంఘానికి కీలకంగా వ్యవహరించిన వారే పలు వివాదాల్లో జోక్యం చేసుకొని వాటిని చక్కబెట్టుకున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న వ్యక్తులు సర్కారు భూములను కాపాడాల్సిన బాధ్యత ఉన్నది. అందులో సర్వే అండ్ ల్యాండ్ రికార్డుకు చెందిన వారికి మరింత ఎక్కువ బాధ్యత ఉంటుంది. కానీ అదే శాఖకు చెందిన ఒకరు అసైన్డ్ భూములను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి చేతులు మార్చినట్లుగా సమాచారం. ఎడపల్లి మండలంలో పదుల ఎకరాల్లో ఈ తతంగం జరిగిందని టీఎన్జీవో సభ్యులే ఏకరువు పెడుతున్నారు. గెజిటెడ్ అధికారిగా పదోన్నతి వచ్చినప్పటికీ స్వచ్ఛందంగా సంఘం బాధ్యతల నుంచి తప్పుకొని గౌరవాన్ని కాపాడుకోవాల్సి ఉండగా అదేమీ చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అని సాధారణ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

# కాంగ్రెస్ హామీలు నెరవేరిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్**

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 28: అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీ మభ్యపెట్టే హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని, అన్ని హామీలను నెరవేరిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం రాత్రి బోధన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన విషయంపై అసలు ఎక్కడా ఊసెత్తడం లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాటి అమలుపై బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ, పలు దాడులు జరిగినా స్పందించడం లేదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.




# అవినీతి ఖజానా

ఏ పని జరగాలన్నా చేయి తడపాల్సిందే
ఆదాయపన్ను క్లెయిమ్స్‌పై సిబ్బంది గురి
విలవిల్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
సబ్ ట్రెజరీల్లోనూ భారీగానే వేధింపులు
ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

ట్రెజరీలో వసూళ్ల దందా

నిజామాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) 'ఖజానా'లో అవినీతి రాజ్యమేలుతున్నది. ముడుపులు చెల్లిస్తేనే ఫైల్ ముందుకు కదులుతున్నది. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులే పీక్కు తినే శాఖ ఏదైనా ఉందా అంటే అది కచ్చితంగా ఖజానా శాఖనే. వివిధ శాఖలకు చెందిన బిల్లులకు, ఉద్యోగులకు వర్తించే వివిధ ప్రయోజనాలపై టార్గెట్లు పెట్టి మరీ ట్రెజరీలో దోచుకుంటున్నారు. చేయి తడపనిదే ఇక్కడ ఏ పనీ కాదు. ఫైలు ముందుకు కదలదు. డబ్బులు ఇవ్వలేదో ఫైళ్లు తొక్కిపెట్టడం, కొర్రీలు పెట్టి నెలల తరబడి తిప్పించుకోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ట్రెజరీ కార్యాలయాల చుట్టూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. వార్షిక ఆదాయ పన్నుకు సంబంధించిన క్లెయిమ్స్ కోసం కోశాధికారి కార్యాలయానికి వెళ్తే ఫైల్‌కు ఒక రేటు చొప్పున దోచుకుంటున్న వైనంపై టీచర్లు మండిపడుతున్నారు. తప్పనిసరై ఎస్టీవోల్లో ట్రెజరీ ఉద్యోగులు అడిగిన కాడికి చేతులు తడిపి పని చేయించుకుంటున్నారు. లేదంటే ఐటీ క్లెయిమ్స్ ఇబ్బందులు తలెత్తుతాయని, ఫిబ్రవరికి సంబంధించిన జీతాలు నిలిచిపోతాయనే భయంతో సొమ్ము ముట్టజెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది. నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ల చాంబర్లకు సమీపంలోనే ఉండే ట్రెజరీ కార్యాలయాల్లో కొనసాగుతున్న లంచాల పర్వంపై బహిరంగంగానే చర్చ జరుగుతున్నది.

**కలెక్టరేట్లకు వచ్చినా అంతేనా..**

గతంలో ట్రెజరీ కార్యాలయాలు ఎక్కడో విసిరేసినట్లుగా ఉండేవి. దీంతో సిబ్బంది ఆడిందే ఆట... పాడిందే పాట అన్నట్లుగా ఉండేది. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు నిర్మించి అన్ని శాఖలను ఒకే గూటి కిందకు చేర్చారు. ప్రైవేటు బిల్డింగ్‌లలో, ప్రభుత్వ ప్రాంగణాల్లోనే ఎక్కడో విసిరేసినట్లుగా ఉండే ట్రెజరీ ఆఫీసులను సైతం తీసుకొచ్చి సమీకృత కలెక్టరేట్‌లోనే ఆఫీసులను కేటాయించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారుల చెంతనే ఖజానా శాఖకు సైతం స్థానం కల్పించడంతో అవినీతి, అక్రమాలు అదుపు చేయొచ్చని కేసీఆర్ సర్కారు భావించింది. పర్యవేక్షణ పెరగడంతో గతంలో లంచాలు అడగాలంటే ఉద్యోగులు భయపడే వారు. కానీ ఇప్పుడు మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోయింది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక బహిరంగంగానే దోపిడీ జరుగుతున్నదని వివిధ శాఖల ఉద్యోగులు వాపోతున్నారు. కలెక్టర్ చాంబర్‌కు కూత వేటు దూరంలోనే ఉండే ట్రెజరీలో అక్రమాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు గుర్తించకపోవడం శోచనీయం. పర్యవేక్షణ లేమి మూలంగా ట్రెజరీ శాఖలో ఇష్టారాజ్యం నడుస్తున్నది. గతంలో వీఆర్ఏలకు శాఖల కేటాయింపు సమయంలోనూ ట్రెజరీలో ఇదే రకమైన వసూళ్ల పర్వం వెలుగు చూడగా, ఇప్పుడు టీచర్ల విషయంలోనూ అలాగే జరుగుతున్నది.

**ఉద్యోగులపై ఉద్యోగుల వేధింపులు..**

ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు జిల్లా ట్రెజరీ కార్యాలయం గుండె కాయ వంటిది. ఒక్క పైసా విడుదల కావాలన్నా సంబంధిత అధికారులు నిబంధనలకు అనుగుణంగా మంజూరు చేస్తారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేసిన వ్యయాలకు బిల్లులు సమర్పిస్తే అందుకు అనుగుణంగా డబ్బులు రిలీజ్ చేయడం పరిపాటి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కోశాధికారి కార్యాలయంలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం ప్రజల అవసరాలను తీరుస్తూ బాధితుల కష్టనష్టాలను తీర్చే పలు శాఖల అధికారులే.. ట్రెజరీ అధికారులకు బాధితులుగా మారుతున్నారు. బిల్లుల మంజూరులో తాత్సారం, కమీషన్ల డిమాండ్ బహిరంగంగానే నడుస్తుండటంతో అవాక్కవుతున్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో రావాల్సిన బిల్లులకు ట్రెజరీ ద్వారా మంజూరు చేసుకునేందుకు శాఖలన్నీ బిల్లులు సమర్పిస్తుండగా పర్సెంటేజీల దందాతో ప్రభుత్వ శాఖల అధికారులు కంగు తింటున్నారు. చిన్నపాటి లోటుపాట్లను ఆసరా చేసుకుంటున్న ట్రెజరీ సిబ్బంది బిల్లులు ఇలా సమర్పించగానే... అలా డబ్బులు డిమాండ్ చేస్తుండటం విశేషం. జీపీఎఫ్, గ్రాట్యూటీ, ఈఎల్స్, చివరకు మెడికల్ రీ-యింబర్స్‌మెంట్‌లకు సమర్పించిన బిల్లులకు సైతం పర్సంటేజీలు వసూళ్లు చేస్తుండటం గమనార్హం.

**ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు..**

"ఐటీ క్లెయిమ్స్ కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. కచ్చితమైన బిల్లులు సమర్పించి జీతాలు పొందవచ్చు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఫిబ్రవరి 29కే క్లెయిమ్స్ సమర్పణకు ఆఖరు తేదీ కావడంతో పని భారం ఎక్కువగా ఉంది. సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోనూ ఎవరైనా డబ్బులు అడిగితే ఫోన్ నెం.77999 34123కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు."

– సాయిబాబా, కామారెడ్డి జిల్లా ట్రెజరీ అధికారి

## బోధన్, ఆర్మూర్ ఆర్డీవోల బదిలీ

బోధన్/ఆర్మూర్, ఫిబ్రవరి 28: బోధన్ ఆర్డీవో బురుగు రాజాగౌడ్, ఆర్మూర్ ఆర్డీవో టి.వినోద్‌కుమార్ బదిలీ అయ్యారు. వీరిని బదిలీ చేస్తూ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బోధన్ ఆర్డీవో రాజాగౌడ్‌ను ఆర్మూర్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీచేశారు. మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సిద్ధం దత్తు బదిలీపై బోధన్ ఆర్డీవోగా వస్తున్నారు.

## ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి విఫలయత్నం

నవీపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ఎర్ర సాయన్న కిరాణ దుకాణం ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి గుర్తుతెలియని దుండగులు యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున 4:30 గంటలకు దుండగులు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసే క్రమంలో మిషన్‌కు అమర్చిన సైరన్ మోగింది. 10 నిమిషాల వ్యవధిలోనే పోలీసులకు ముంబై నుంచి సమాచారం అందడంతో స్థానిక ఎస్సై యాదగిరిగౌడ్ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి బయల్దేరారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు పారిపోయారు. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్ పరిశీలించారు. నిజామాబాద్ నుంచి పల్సర్ బైక్ పై వచ్చిన దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా, పోలీసుల రాకను గమనించిన దొంగలు మసీదు ఏరియా నుంచి బాసర వైపు పారిపోయినట్లు సీసీ పుటేజీలో రికార్డయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

## అధిక ధర పలికిన పసుపు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 28: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో పసుపు పంట బుధవారం అత్యధిక ధర పలికింది. బాల్కొండ మండలం వన్నెల్(బీ) గ్రామానికి చెందిన రైతులు పన్నల మహిత, రాజేందర్ 17క్వింటాళ్ల పసుపుని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. వ్యాపారులు బుధవారం క్వింటాల్‌కి రూ.14,255 ధర చెల్లించి పసుపును కొనుగోలు చేయడం విశేషం.



దవాఖానలో బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ కవిత పరామర్శ

సిరికొండ/ఇందల్వాయి, ఫిబ్రవరి 28: సిరికొండ మండలంలో ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ బుధవారం పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ రాజవ్వ చిన్నకుమారుడు అల్లిపురం శేఖర్, విద్యుత్‌షాక్‌తో బాబూరావు మరణించారు. వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. వారి వెంట ఎంపీపీ సంగీతా రాజేందర్, జడ్పీటీసీ మాన్‌సింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు బెల్దారి గోపీ, అయిత సుజా ఫిలిప్ తదితరులు ఉన్నారు. విద్యుత్ షాక్‌కు గురై జిల్లా కేంద్రంలోని ప్రగతి దవాఖానలో చికిత్స పొందుతున్న ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన మొచ్చ సాయిలును ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. అంతకు ముందు సిరికొండ వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు తోట రాజన్న కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



సిరికొండలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

**ధర్నా చేస్తేనే వేతనాలు..**



వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ మాతాశిశు దవాఖానలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. దీంతో రెండు నెలల వేతనాలు మంగళవారం చెల్లించగా, మిగతా రెండు నెలల వేతనాలు గురువారం చెల్లించేలా చూస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నా విరమించారు.
–బాన్సువాడ, ఫిబ్రవరి 28

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కామారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ పాటిల్

నిజామాబాద్‌లో ఓ కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

**నవీపేటలో ఒకరు డిబార్**

ఖలీల్‌వాడి/ కామారెడ్డి/నవీపేట, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బుధవారం ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 8.15 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 19,177 మంది విద్యార్థులకు 18,322 మంది హాజరుకాగా 795 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 9,750 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 9,329 మంది హాజరుకాగా, 421మంది గైర్హాజరయ్యారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, సాందీపని కళాశాల సెంటర్‌ను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా పలు సెంటర్ల వద్ద నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను సిబ్బంది లోనికి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు నిరాశగా వెనుదిరగడం కనిపించింది. నవీపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా పట్టుకొని డిబార్ చేసినట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.



నిజామాబాద్‌లోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



## పార్టీ మార్పుపై ప్రజాగ్రహం

బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్ రమాదేవి పార్టీ మారడంపై పదో వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ బుధవారం ఆమె ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించారు. నమ్మి గెలిపిస్తే పార్టీ మారతావా అని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని నిరసన తెలిపారు.
– బాన్సువాడ, ఫిబ్రవరి 28

## మనుమడిని హత్యచేసిన నానమ్మకు జీవిత ఖైదు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 28: మనుమడిని వరదకాలువలో పడేసి హత్యచేసిన నగువోతుల గంగవ్వకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు వెలువరించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ కాలనీకి చెందిన గంగవ్వ కుమారుడు గంగాధర్‌కు మూడున్నర సంవత్సరాల వయస్సు గల కుమారుడు లక్కీ ఉండేవాడు. గంగవ్వ చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవించేది. ఆమె భర్త చాలా రోజుల క్రితమే మృతి చెందాడు. గంగవ్వకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్దకొడుకు గంగాధర్ తన భార్య గంగామణిని దాంపత్య విషయంలో తలపై ఇటుకతో కొట్టి చంపినట్లు అభియోగాలతో జైలుకు వెళ్లి, బెయిల్‌పై తిరిగి వచ్చాడు. గంగాధర్ కొడుకు లక్కీ పోషణను గంగవ్వ చూసుకునేది. 70ఏండ్ల వృద్ధురాలు కావడం, మనుమడు లక్కీ బాగోగులు భారంగా మారడంతో ఆ బాలుడిని చంపాలనుకున్నది. కొడుకు గంగాధర్ లేని సమయంలో మే 10, 2023న మధ్యాహ్నం చిత్తు కాగితాలు ఏరుకోవడానికి మనుమడిని వెంట తీసుకొని కమ్మర్‌పల్లి మండల కేంద్ర శివారులోని ఉప్లూర్ వెళ్లే రహదారిలో ఉన్న వరదకాలువలో పడేసింది. బాలుడు ఊపిరాడక మరణించాడనే హత్య అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో నిరూపణ అయినట్లు సెషన్స్ జడ్జి సునీత తీర్పులో పేర్కొన్నారని ఎస్సై వివరించారు. హత్యానేరం రుజువుకావడంతో గంగవ్వకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ 14 పేజీల తీర్పు వెలువరించినట్లు తెలిపారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించగా పీపీకి సహాయకారిగా కమ్మర్‌పల్లి స్టేషన్ కానిస్టేబుల్ రామారావు ఉన్నారని చెప్పారు

## ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలి..

**తల్లి అదృశ్యం.. కాలువలో దూకిందనే అనుమానం**



అదృశ్యమైన ఆందోల్ శిరీష అలియాస్ పద్మ

నిజాంసాగర్, ఫిబ్రవరి 28: ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలేసి తల్లి అదృశ్యమైన ఘటన మహ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్‌లో బుధవారం చోటు చేసుకున్నది. బాధితురాలి సోదరుడు శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన ఆందోల్ శిరీష అలియాస్ పద్మ(25)ను మూడేండ్ల కిందట ఎల్లారెడ్డి మండలం గండిమాసన్‌పేట్‌కు చెందిన ఆందోల్ సతీశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సంవత్సరం బాబు యోగేశ్ ఉన్నాడు. ఈ నెల 17వ తేదీన యోగేశ్ పుట్టిన రోజు వేడుకలు సైతం ఘనంగా నిర్వహించారు. బుధవారం గండిమాసన్‌పేట్ నుంచి శిరీష మెట్టెలు చేయించుకునేందుకు తల్లిగారింటికి బయల్దేరగా, భర్త సతీశ్ ఎల్లారెడ్డిలో బస్సు ఎక్కించి ఇంటికెళ్లాడు. శిరీష బాన్సువాడలో దిగాల్సి ఉండగా గాలీపూర్ సమీపంలోని గేటు వద్ద దిగింది. అక్కడి నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న బోధన్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కుమారుడు యోగేశ్‌ను వదిలి అదృశ్యమైంది. రోడ్డుపై బాబు ఏడుస్తూ కనిపించడంతో ప్రయాణికులు బాబును చేరదీశారు. సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ ఒడ్డుపై చెప్పులు, బ్యాగు ఉండడంతో తనిఖీ చేయగా శిరీష ఆధార్ కనిపించింది. దీంతో స్థానికులు డయల్100కు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాబును తీసుకొని శిరీష కుటుంబసభ్యులకు అప్పగించారు. అల్లుడి వేధింపులతోనే తన బిడ్డ ప్రధాన కాలువలో పడిందని శిరీష తల్లి లక్ష్మి రోదించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, ప్రధాన కాలువకు కొనసాగుతున్న నీటి విడుదలను నిలిపివేశారు.